క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

జూలపల్లి: త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో పద్మజ సూచించారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు, ఎంపీవో, ఏపీవో, కార్యదర్శులు, బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటరు లిస్టు వార్డుల వారీగా తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దారు కిరణ్‌కుమార్, ఏపీవో సదానందం, ఎంపీవో అనిల్‌రెడ్డి, కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

కమాన్‌పూర్: మండల వ్యవసాయాధికారిగా గిరి రామకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఏవోగా విధులు నిర్వహించిన బండి ప్రమోద్‌కుమార్ పాలకుర్తి మండలానికి బదిలీ కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నుంచి రామకృష్ణ బదిలీపై వచ్చారు.

బీఎల్వోలకు శిక్షణ

ఓదెల: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్న ఆధ్వర్యంలో బీఎల్వోలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో భాగంగా ఓటరు లిస్టులో మృతిచెందిన వారిని తొలగించాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యం అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. పార్టీ నాయకులు వినీత్, బియ్యాని శివకుమార్, దాసరి చంద్రమౌళిగౌడ్, తూటి రఫీ, సమ్మయ్య, జితేందర్, విజయ్, రామస్వామి, రమేశ్, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో రాఖీ వేడుకలు



రాఖీ కడుతున్న ఎమ్మెల్యే సతీమణి

రామగుండం: రక్షాబంధన్ వేడుకలలో భాగంగా మంగళవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బూక్య సాయిరాంనాయక్‌కు ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

కూలీ మృతికి కారణమైన క్వారీని సీజ్ చేయాలి

పెద్దపల్లిరూరల్: ఎండపల్లి మండలం మారేడుపల్లిలోని లక్ష్మీగణపతి బండక్వారీలో పని చేస్తున్న కూలీ కుందన్‌కుమార్ మృతిచెందాడు. కాగా అతడి కుటుంబానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. మృతికి కారణమైన క్వారీని సీజ్ చేయాలని మంగళవారం పెద్దపల్లి కార్మికశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా సుల్తానాబాద్ గోదాంలో మరణించిన కూలీ మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కండె కరుణాకర్, తదితరులు ఉన్నారు.

నిందితులను ఉరితీయాలి

రామగుండం: ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను తక్షణమే ఉరి తీయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి కుందనపల్లి గ్రామ పంచాయతీ ఎదుట కొవ్వొత్తులతో మృతురాలికి నివాళి అర్పించారు. రజిత, సుంకరి రవి, ఆలేటి గణేశ్, నజియా సుల్తానా, బండిపల్లి చంద్రయ్య పాల్గొన్నారు.

బీమాతో అన్నదాతకు ధీమా

- 18 నుంచి 59ఏళ్ల వరకు అర్హులే
- ఆగస్టు 5తో ముగిసిన కొత్త దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్: ఆరుగాలం కష్టం చేసి బతికే రైతన్నకు అనుకోని ఆపద వచ్చి మరణిస్తే మేమున్నాం అంటూ ప్రభుత్వం అండగా నిలిచేందుకు రైతు బీమా సౌకర్యం కల్పించింది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ప్రభుత్వమే రైతు పేరిట ఏడాది కాలానికి బీమా చేయిస్తుంది. ఈ అవకాశాన్ని జిల్లాలోని నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన 5577 మంది రైతులు సద్వినియోగం చేసుకొన్నారు. ఎల్‌ఐసీ రూ.5లక్షల పరిహారాన్ని 15 రోజుల్లో అందజేస్తారు. గతేడాది ఈ పథకం ద్వారా బీమా తీసుకున్న రైతులకు ఈ నెలతో కాలపరిమితి ముగుస్తుంది. దీంతో అప్పటి వరకు ఉన్నవారికి రెన్యూవల్ చేస్తుండగా నూతనంగా పట్టాపాస్ పుస్తకం కలిగి ఉన్న వారి నుంచి నూతన దరఖాస్తులు వ్యవసాయశాఖ స్వీకరించింది.

పాసు పుస్తకం తప్పనిసరి..

పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న వారికి బీమా వర్తిస్తుంది. ప్రభుత్వం ఒక్కో రైతు పేరిట ప్రీమియం చెల్లిస్తుంది. నూతనంగా పథకంలో చేరే రైతులు మాత్రం ఈ ఏడాది జూన్ 22 వరకే కొత్త పాస్‌పుస్తకం కలిగి ఉండాలని నిబంధన విధించింది. అర్హులైన రైతులు ఆగస్టు 5లోగా గ్రామ వ్యవసాయ అధికారికి దరఖాస్తులు అందజేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో (ఫైల్)

దరఖాస్తు స్వీకరణ పూర్తి

రైతుబీమా కోసం జిల్లావ్యాప్తంగా రైతుల నుంచి ఈనెల 5 వరకు గ్రామాల వారీగా ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించారు. 18ఏళ్ల నుంచి 59ఏళ్ల వారు జిల్లావ్యాప్తంగా కొత్తగా 5577 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 88,583 మంది రైతులు ఉన్నారు.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, పెద్దపల్లి

బదిలీ అధికారికి ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలో ఫారెస్ట్ డీజీఎంగా విధులు నిర్వహించిన బానోత్ కర్ణ ఆర్జీ–1 ఏరియాకు బదిలీపై వెళ్లారు. జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు మంగళవారం ఆయనను ఆత్మీయంగా సన్మానించారు. అనంతరం జీఎంలు మాట్లాడుతూ డివిజన్‌లో ఫారెస్ట్ అధికారిగా కర్ణ చేసిన సేవలు మరవలేనివని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్లు వై.వి.శేఖర్‌బాబు, కె.యాదయ్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, అధికారులు కె.ఐలయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ సమీపంలో వివిధ కాలనీలకు వెళ్లే మంచినీటి పైప్‌లైన్‌లు లీకేజీ అవుతున్నాయి. తాగునీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం ఉంది. లీకేజీలను వెంటనే అరికట్టి ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలి.

– కావేటి కుమార్‌యాదవ్, వ్యాపారి, సుల్తానాబాద్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శోభా శంకర్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్, సెల్ 63095 32229

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 98499 71500

జర్నలిస్టుల ఇళ్లస్థలాల పంపిణీకి కృషి

- ఎమ్మెల్యే విజయరమణారావు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టులకు ఇళ్లస్థలాల పంపిణీకి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎర్రోజు వేణుగోపాల్, లైసెట్టి రాజు, ప్రవీణ్‌రెడ్డి, బెజ్జంకి నరేశ్, గౌస్ పాషా, పులిపాక రామకృష్ణ, ఆరెల్లి మల్లేశ్, రాజశేఖర్, వీరమల్ల విద్యాసాగర్, సతీశ్‌రెడ్డి, శివ చారి, ఆకుల రమేశ్, బోనాల నాగరాజు, చేగొండ రవికుమార్, పంది కుమార్, కలవేన రాజేందర్, కృష్ణమూర్తి, నాగిశెట్టి శ్రీనివాస్, సాబీర్ పాషా, ఇబ్రహీం, తిరుపతి, అడిచెర్ల రమేశ్, నగునూరి శ్రీనివాస్, పూరెళ్ల శ్రావణ్, కొలిపాక కృష్ణ, జాపతి సంజీవ్, సాదిక్, మాజిద్ పాషా పాల్గొన్నారు.

సుల్తానాబాద్ కోర్టులో హాజరైన ఎమ్మెల్యే

సుల్తానాబాద్: సుల్తానాబాద్ కోర్టుకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం హాజరయ్యారు. గతంలో తనపై నమోదై ఉన్న కేసులకు సంబంధించిన వాయిదాలకు కోర్టుకు హాజరయ్యారు. నియోజకవర్గంలో రైతులకు సాగునీరు పంటలకు అందకపోవడంతో ఎండిపోయాయని రైతుల ఆయనకు విన్నవించగా వారిని ఆదుకునేందుకు డి–86 కెనాల్ ద్వారా సాగునీరు అందించాలని ఆందోళనలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సారెస్పీ సుల్తానాబాద్ కార్యాలయాన్ని ముట్టడించే క్రమంలో కొందరు కార్యకర్తలు ఫర్నిచర్ ధ్వంసం చేశారు. రాస్తారోకో చేయడంతో అధికారులు కేసు నమోదు చేశారు. రైతుల కోసం ఆఫీసుల ముట్టడి, సాగునీటి విడుదల కోసం గేట్లు ఎత్తివేత లాంటి అనేక పోరాటాలు, ఆందోళనలు రైతుల కోసం నిర్వహించి వారికి అప్పుడు సకాలంలో సాగునీరు అందేలా కృషి చేశారు. అప్పుడు పోలీసులు ఆయనపై అనేక కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా ఆ కేసులకు సంబంధించి మంగళవారం సుల్తానాబాద్ కోర్టులో వాయిదా ఉండడంతో ఆయన హాజరయ్యారు. సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్, డీసీఎంఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ కల్లెపల్లి జానీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, గాజుల రాజమల్లు, కుమార్ కిషోర్, గరిగె శ్రీనివాస్, రఫీ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కేసు వాయిదా నిమిత్తం సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును కోర్టు బార్ అసోసియేషన్ ఆఫీసులో న్యాయవాదులు ఆయనను సన్మానించారు. పడాల శ్రీరాములు, లక్ష్మీరాజంయాదవ్, బాలకిషన్ ప్రసాద్, ఓడ్నాల రవీందర్ రాజేంద్రప్రసాద్, దూడెం అంజన్న, శివ యాదవ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం



శిక్షణ ప్రారంభిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి పరిసర, ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువత ఉపాధి కల్పనే ధ్యేయంగా సంస్థ ముందుకు సాగుతోందని ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక టీటీసీలో వోల్వో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని జీఎం జెండా ఊపి ప్రారంభించారు. సీఎస్ఆర్‌లో భాగంగా నిరుద్యోగ యువతకు ఓసీపీ ప్రయివేట్ ఓబీల్లో భారీ యంత్రాలు నడిపేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ దఫాలో 52 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 11 ఏరియాల నుంచి ఎంపికైన అభ్యర్థులకు టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ) ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 7బ్యాచ్‌లుగా 335 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు వోల్వో ఆపరేటర్ గుర్తింపు సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. నాయకులు రంగు శ్రీనివాస్, అధికారులు రామ్మోహన్, రవీందర్‌రెడ్డి, అశోక్‌రావు, వోల్వో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ హరిబాబు, వీటీసీ మేనేజర్ డినీల్, సీనియర్ పీవో హన్మంతరావు, రామయ్య పాల్గొన్నారు.

ఆర్జీ–3 ఏరియా పర్సనల్ విభాగాధిపతిగా సుదర్శనం



రిపోర్ట్ చేస్తున్న సుదర్శనం

రామగిరి: ఆర్జీ–3 ఏరియా పర్సనల్ విభాగాధిపతిగా బి.సుదర్శనం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ముప్పిడి రవీందర్‌రెడ్డి బదిలీపై ఆర్జీ–1కు వెళ్లగా ఆయన స్థానంలో శ్రీరాంపూర్ ఏరియా సూపర్‌బజార్ విభాగం డివిజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సుదర్శనం బాధ్యతలు స్వీకరించి జీఎం సుధాకర్‌రావుకు రిపోర్ట్ చేశారు.

రుణమాఫీ కాని రైతులు వివరాలు సమర్పించాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏవో ప్రత్యూష

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ కాని రైతులు తమ పరిధిలోని రైతువేదికలో సంబంధిత వివరాలతో దరఖాస్తులు సమర్పించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండలంలోని తెలుకుంట రైతువేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏవో ప్రత్యూష మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న రైతుల బ్యాంకు రుణమాఫీ కచ్చితంగా అవుతుందని వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

రామగిరి: మండలంలో వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల నుంచి మంగళవారం రత్నాపూర్, సుందిల్ల, ఆదివారంపేటలోని రైతువేదికలలో ఏవో చిందం శ్రీకాంత్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 98 గ్రీవెన్స్ దరఖాస్తులు స్వీకరించినట్లు ఏవో తెలిపారు. ఏఈవోలు అరవింద్, నవీన్, మౌనిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

గోదావరిఖని: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నియంత్రణపై పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీ, హెచ్‌కేఆర్ సహకారంలో జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలన్నారు. థర్మోప్లాస్టిక్ పెయింటింగ్‌లు, సైన్‌బోర్డుల ఏర్పాటు, రోడ్డు ఆక్రమణలు తొలగించాలన్నారు. వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం కలిగే విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. జాతీయ రహదారులపై వేగాన్ని నియంత్రించడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సీఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

సుల్తానాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మానేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సరఫరా చేస్తుండగా అధికారులు సుల్తానాబాద్‌లో ట్రాక్టర్లను పట్టుకొని కార్యాలయానికి తరలించారు. 6 ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం 22న నిర్వహించే చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలంలేని వారికి ఇంటి స్థలం ఇవ్వాలని, గృహ నిర్మాణానికి రూ.10లక్షల ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం వాగ్దానం ప్రకారం పెన్షన్లు ఇవ్వాలన్నారు. రైతాంగ రుణాలను రద్దు చేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. పంట బీమా పథకం వెంటనే అమలు చేయాలని, వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు తోకల రమేశ్, ఆడెపు శంకర్, వైకుంఠం,రాయమల్లు పాల్గొన్నారు.

భారత్‌బంద్ విజయవంతం చేయండి

మంథని: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకిస్తూ బుధవారం జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు దాసరి దశరథం, నూకల బాలయ్య పిలుపునిచ్చారు. మంథనిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. బంద్‌లో అన్నివర్గాల వారు సహరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పోచయ్య, రామ్మూర్తి, గట్టయ్య, వేణు, ప్రసాద్, ఆనంద్, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు.

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. స్థానిక జనక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ముత్తారం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మున్నూరుకాపు న్యాయవాదుల నిరసన



గోదావరిఖనిటౌన్: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని మంగళవారం మున్నూరు లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు మౌన ప్రదర్శన నిర్వహించారు. మున్నూరుకాపు కార్పొరేషన్‌కు వెంటనే నిధులు కేటాయించాలని, పేద విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. నిధులు కేటాయించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని న్యాయవాదులు పేర్కొన్నారు. లీగల్‌సెల్ నాయకులు జవ్వాజి శ్రీనివాస్, ఆరె మధు, ముచ్చకుర్తి కుమార్, రాకం దామోదర్, జాపతి శ్రీనివాస్, రాగం శ్రీధర్, వేణు, తిరుపతిరావు, శ్రీలత పటేల్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటకు చెందిన మిట్టపెల్లి ప్రశాంత్ సెల్‌ఫోన్ గ్రామ పరిధిలో పోగొట్టుకోగా స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి సిగ్నల్ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి మంగళవారం ప్రశాంత్‌కు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

- **యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి హోరాహోరీ పోటీ**

పాలకుర్తి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి హోరాహోరీ పోటీ నెలకొంది. బసంత్‌నగర్‌కు చెందిన కామోజ్వల వాసుదేవరావుతో పాటు మంథని నియోజకవర్గం పరిధిలోని రాణాపూర్‌కు చెందిన దండుగుల శ్రీకాంత్ పోటీలో ఉన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు వాసుదేవరావుకు మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు, పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు సహకరించాలని పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అయితే రాణాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కూడా పోటీలో ఉండటంతో ఇరువురి మధ్య పోటీ నెలకొంది.

- **ప్రభుత్వ పాఠశాల తాళం పగులగొట్టి.. మద్యం సేవించిన ఆకతాయిలు**

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇదులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి మద్యం సేవించినట్లు గ్రామస్తులు తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం కె.దాసు పేర్కొన్నారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- **సీజనల్ వ్యాధులపై అవగాహన**

గోదావరిఖని: సీజనల్ వ్యాధులపై ఆర్జీ–2 సెక్టార్–3 డిస్పెన్సరీలో కార్మిక కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య అధికారి పద్మ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్‌గున్యా గురించి వివరించారు. పరిసరాల్లో నిల్వనీరు లేకుండా చూసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డాక్టర్లు వెంకటేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, సాహితి పాల్గొన్నారు.

- **వాగులో కొట్టుకుపోయి గేదె మృతి**

మంథని: మండలంలోని కన్నాలకు చెందిన పొయిల రాములుకు చెందిన గేదే మంగళవారం సమీపంలోని బొక్కల వాగు వరదలో కొట్టుకుపోయి మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని రాములు తెలిపాడు.

- **పేకాట స్థావరంపై పోలీసుల దాడి**

మంథని: మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో చెట్లపొదల్లో పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నగదుతో పాటు ఏడుగురిని పట్టుకున్నారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్, ఎస్సై రవిప్రసాద్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఏడుగురితో పాటు రూ.20,390 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని మంథని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

- **కొత్త పంచాయతీల ఏర్పాటుపై హర్షం**

మంథని: మంథని, ముత్తారం మండలాల పరిధిలోని తోటగోపయ్యపల్లె, జిల్లెలపల్లిలను కొత్త గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినందుకు మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు మంథని మాజీ జెడ్పీటీసీ తగరం సుమలత, ముత్తారం మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్యతో పాటు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు జూలైలో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించగా సోమవారం అధికారికంగా ప్రకటించడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- **23, 24 తేదీల్లో క్రీడలు**

ఓదెల: మండలంలోని పొత్కపల్లి హైస్కూల్‌లో 23, 24 తేదీల్లో బాల, బాలికలకు క్రీడలు నిర్వహించనున్నట్లు ఓదెల ఎంఈవో ఆరెపల్లి రాజన్న తెలిపారు. 23న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, 24న బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు పీడీలు హరికృష్ణ, విష్ణు, సదానందం, రాజేందర్‌రెడ్డి, స్వరూప, కుమారస్వామిని సంప్రదించాలన్నారు.

- **ఉచిత వైద్యపరీక్షలు**

పెద్దపల్లిరూరల్: మండలంలోని రాఘవాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మాత్రలు పంపిణీ చేశారు.

- **ఆలయంలో ప్రత్యేక పూజలు**

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ మంగళవారం సందర్భంగా ఆంజనేయ స్వామితో పాటు నవగ్రహాలకు పూజలు నిర్వహించారు.

- **పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలి**

ఓదెల: పరిసరాల పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలని ఓదెల ఎంపీవో షబ్బీర్ ఆదేశించారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఎంపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తచెదారం దూరప్రాంతాలకు తరలించాలన్నారు. ఏపీవో రమేశ్ పాల్గొన్నారు.

- **కాంగ్రెస్ నేత మృతికి సంతాపం**

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొగ్గుల చిన్నయ్య(75)మంగళవారం మృతి చెందాడు. కాలనీ కాంగ్రెస్ నాయకులు ఆయన దేహంపై పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, సత్యనారాయణరెడ్డి, దశరథం, సరోత్తమ్ రెడ్డి, వికాస్‌రెడ్డి ఉన్నారు.

- **ఆయన నేత్రాలు సజీవం**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొగ్గుల చిన్నయ్య(75) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ వాసు ఆధ్వర్యంలో టెక్నీషియన్ సతీశ్ కుమార్ నేత్రాలు సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్‌కు తరలించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, సానా రామకృష్ణారెడ్డి, భీష్మచారి పాల్గొన్నారు.